సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 27 । నవంబర్ । 2024



సోమశిలలో 70.58 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 70.58 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 50, ఉత్తర, దక్షిణ కాలువలకు 800, కండలేరుకు 4600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,200
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,200
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,416
సవర (8 గ్రాములు)	రూ.59,328

గరిష్టం/కనిష్టం
24.3 /22.0

వాతావరణం

జిల్లాలో బుధవారం అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణం శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 96 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, అధికారులు

నెల్లూరు (పొగతోట): భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని, దానికి కారణం భారత రాజ్యాంగమేనని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జెడ్పీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని జాతికి అంకితం చేసిన రోజును 2015లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. రాజ్యాంగాన్ని శక్తివంతమైన ఆయుధంగా మలిచి కోట్లాది మంది ప్రజలకు అందించారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర ఎప్పటికి మరువలేనిదన్నారు. మన రాజ్యాంగం స్వేచ్ఛ సమానత్వం, ప్రాథమిక హక్కులు, జాతి అభివృద్ధికి సోపానాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత విశిష్ట స్థానాన్ని సంపాదించిన రాజ్యాంగాన్ని గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో 29న జాబ్‌మేళా

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29 స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కేఎల్ గ్రూపు, అమెజాన్, ఎస్ఎస్ ఇన్వెస్ట్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అమర్ రాజా బ్యాటరీ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9177824585, 9491284199 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

• ఎస్పీ జి. కృష్ణకాంత్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

నెల్లూరు (క్రైమ్): రాజ్యాంగానికి లోబడి ప్రతి ఒక్కరూ పని చేస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. మంగళవారం భార్యత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాంపు కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణన్నారు. పోలీసులు సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, పౌరుల ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షించాలన్నారు. ప్రపంచంలోనే భారత్‌ది అతిపెద్ద రాజ్యాంగమన్నారు. భారతీయ జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనమని, రాజ్యాంగ అధికరణలు, సూత్రాలు, మార్గదర్శకాలు, ప్రజ్యాస్వామ్య ఫలాలు ప్రజలందరికి చేరువయ్యేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ మునిరాజా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు రాజారావు, పాల్‌రాజు, ఆర్‌ఎస్‌ఐ తిరుమలరెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మరికొన్ని పీజీ సీట్లు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మరికొన్ని పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్ కమిషన్) మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ పీజీ సీట్లు లేవు. తొలి సారిగా ఈ ఏడాదిలో రెండు నెలల క్రితం పలు విభాగాలకు సంబంధించి 43 పీజీ సీట్లును ఎన్ఎంసీ మంజూరు చేసింది. తాజాగా జనరల్ సర్జరీ విభాగానికి 5, ఆర్థోపెడిక్ విభాగానికి 4 పీజీ సీట్లును మంజూరు చేయడం గమనార్హం. దీంతో మొత్తం ఆయా విభాగాల్లో 52 పీజీ సీట్లు మంజూరు కావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు మరింత నాణ్యమైన స్పెషలిస్టు వైద్య సేవలు అందించేందుకు వీలవుతోంది. పీజీ సీట్లు మంజూరుపై మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీరవెంకట నాగరాజమన్నార్ హర్షం వ్యక్తం చేశారు.

‘పన్ను’ ఫైట్

మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే

• నెల్లూరు కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లపై జగడం
• మంత్రి నారాయణ వివాదాస్పద నిర్ణయాలను విభేదించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి
• పన్నుల వసూళ్లలో మంత్రి సొంత ఎజెండాపై ఫైర్
• మున్సిపల్ చట్టాలనే అమలు చేయాలని సున్నితంగా వార్నింగ్
• పేద, సామాన్య వర్గాల కోసం దేనికైనా సిద్ధమని కాలుదువ్విన వైనం

అధికార పార్టీలో నగరపాలక సంస్థ ‘పన్నుల’ వివాదం కాక రేపుతోంది. ఈ వ్యవహారం మంత్రి నారాయణ వర్సెస్ ఎమ్మెల్యే కోటంరెడ్డిగా మారింది. పన్నుల వసూళ్లకు సంబంధించి సొంత ఎజెండా పెట్టుకుని మంత్రి చేసిన వివాదాస్పద నిర్ణయాలను బహిరంగంగానే విభేదిస్తూ ఎందాకైనా.. సిద్ధమంటూ కాలు దువ్వుతున్న తీరు ఆ పార్టీకి తలనొప్పిగా పరిణమిస్తోంది. పన్నులపై ఒత్తిడి, నిర్బంధ వసూళ్ల వ్యవహారం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారుతుందని ఆ పార్టీలో అంతర్గత చర్చ జరుగుతోంది.

‘మీకు వాటర్ ఇవ్వాలి. మంచి రోడ్లు వేయాలి. లైటింగ్ ఏర్పాటు చేయాలి. దోమలు లేని అండర్ డ్రైనేజీలు నిర్మించాలంటే.. కనీసం ట్యాక్స్‌లు కట్టకుండా ఎగనామం పెడితే ఎలా?. పన్నులు చెల్లించమని కార్పొరేషన్ అధికారులు పది రోజులు గడువు ఇచ్చినా.. కట్టకుంటే విద్యుత్‌ను డిస్‌కనెక్ట్ చేస్తున్నారు. నెల్లూరు ప్రజలకు దయచేసి చెబుతున్నా.. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దు.’

– మంత్రి నారాయణ నెల్లూరు కార్పొరేషన్‌లో ఇటీవల మీడియాతో మాట్లాడిన మాటలు.

‘నెల్లూరు కార్పొరేషన్‌లో మున్సిపల్ యాక్ట్ మాత్రమే ఉండాలి. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యాక్ట్, కమిషనర్ సూర్యతేజ యాక్ట్ ఉండకూడదు. ఇక్కడ అధికారులను, కమిషనర్‌ను కూర్చోబెట్టి చెబుతున్నా.. ఇంటి పన్నుల వసూళ్లను ప్రజలను ఒప్పించి.. మెప్పించి చేయాలి. అలా కాకుండా ఇష్టారీతిన భయభ్రాంతులు చేయడం సరైన పద్ధతి కాదు.’

– నెల్లూరు కార్పొరేషన్‌లో మంగళవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన మాటలు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు నగర పాలక సంస్థలో తీసుకునే నిర్ణయాలు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మధ్య అగాధం సృష్టిస్తున్నాయి. మరో వైపు అధికార పార్టీకి ఇవి తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. అనేక విషయాల్లో మంత్రి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని అధికారులను ఆదేశిస్తున్నారు. కార్పొరేషన్‌లో మంత్రి పెత్తనం, ఆధిపత్యం పెరగడం, ఎమ్మెల్యే ప్రాబల్యం తగ్గుతోంది. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలు ఉన్నాయి. సిటీ నియోజకవర్గంలో 28, రూరల్ నియోజకవర్గంలో 26 డివిజన్లు ఉన్నాయి. కార్పొరేషన్‌లో సిటీ ఎమ్మెల్యేకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. రూరల్ ఎమ్మెల్యేకు అంతే ప్రాధాన్యత ఉంటుంది. అయితే సిటీ ఎమ్మెల్యేగా ఎన్నికైన నారాయణ మున్సిపల్ శాఖ మంత్రి కావడంతో కార్పొరేషన్‌లో ఆయన పెత్తనం, ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా కార్పొరేషన్ అధికారులపై పట్టు ఉంటే.. రియల్ ఎస్టేట్ నుంచి బిల్డర్స్, వ్యాపార సముదాయాలు అన్నింటిని తమ గుప్పెట్లోకి తెచ్చుకోవచ్చనేది అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే ఆలోచన.

పట్టు బిగిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇద్దరు టీడీపీ వారే. అయితే నెల్లూరు నగర ఎమ్మెల్యే నారాయణ మున్సిపల్ మంత్రి కావడంతో నగర పాలక సంస్థ ఆయన కనుసన్నల్లోకి వెళ్లింది. అక్కడ పాలనా పరంగా మంత్రి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంత్రి నారాయణ ఆధిపత్యంతో పట్టు బిగిస్తున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో పనుల కోసం అనేక వర్గాలు మంత్రి చుట్టూ తిరుగుతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రాబల్యం తగ్గడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో నారాయణ నిర్ణయాలను ఎమ్మెల్యే బాహాటంగానే ఎండగట్టడంతో ఇద్దరి మధ్య సఖ్యత చెడింది. ఎడమొహం, పెడమొహంతో ఉన్నారు. ఈ క్రమంలో మంత్రి నారాయణ ఎమ్మెల్యే కోటంరెడ్డిని పట్టించుకోవడం మానేశారు. కార్పొరేషన్‌లో మంత్రి నిర్వహించే అధికారిక సమీక్ష సమావేశాలకు కోటంరెడ్డికి ఆహ్వానం కూడా పంపడం లేదు. ఈ పరిణామాలతో ఇద్దరి మధ్య అగాధం మరింతగా పెరిగింది.

చిచ్చు రేపిన పన్నుల వసూళ్లు

నగర పాలక సంస్థకు వివిధ పన్ను బకాయిలు దాదాపు రూ.72 కోట్లు ఉన్నాయి. ఆ బకాయిలు రాబట్టేందుకు మంత్రి నారాయణ నెల్లూరు కార్పొరేషన్ వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.



పన్నులు చెల్లించకపోతే నివాసాలు, వ్యాపార సముదాయాలకు విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని మంత్రి చేసిన ప్రకటనను అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బహిరంగంగానే విభేదించారు. మున్సిపల్ చట్టాలకు అతీతంగా మంత్రి సొంత ఎజెండాతో వ్యవహరిస్తామంటే ఎవరూ ఊరుకోరని సున్నితంగానే హెచ్చరికలు జారీ చేశారు. పన్నులు చెల్లించకపోతే మెప్పించి, ఒప్పించడం, లేదా మున్సిపల్ చట్టాల ప్రకారం చేయాలే కానీ.. కరెంట్ కనెక్షన్లు కట్ చేస్తామని బెదిరింపు ధోరణితో హెచ్చరించడాన్ని అధికార పార్టీ ఎమ్మెల్యేనే ప్రశ్నించడంతో ఇప్పుడు నెల్లూరు రాజకీయాలలో హాట్‌టాపిక్‌గా మారింది.

నెల్లూరు రూరల్‌లో పాగా వేసేందుకేనా..?

నారాయణ గతంలోనూ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నా.. ఒకటీ.. రెండు దఫాలు తప్ప.. ఎప్పుడూ నగర పాలక సంస్థలో కనిపించిన దాఖలు లేవు. ఈ దఫా నెల్లూరు సిటీ నుంచి ఎన్నికైన ఆయన మళ్లీ అదే శాఖ మంత్రిగా కార్పొరేషన్‌లో పాగా వేసేందుకు తరచూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ తన ఆధిపత్యం చాటుకుంటున్నారు. అదే కార్పొరేషన్ పరిధిలో ఉండే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ప్రాధాన్యతను తగ్గించి, తన ప్రాధాన్యతను పెంచుకోవడం వెనుక రూరల్‌లో కూడా పాగా వేసేందుకే అనే ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే కార్పొరేషన్‌లోని కొంత మంది అధికారులను టీంగా ఏర్పాటు చేసి వ్యాపార సముదాయాలు, భవంతులకు వేసిన పన్నుల్లో తేడాలు గుర్తించి మళ్లీ కొలతలు వేసి వాటిని సరి చేసి వసూలు చేసేందుకు మంత్రి ప్రణాళిక సిద్ధం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు తమ అవసరాల కోసం పన్నుల విధింపులో కొంత మేర అనుకూలం చేసుకున్నారు. ఇప్పుడు వీరందరిని దెబ్బతీయడం ద్వారా తన గుప్పెట్లోకి తెచ్చుకునే కుతంత్రానికి మంత్రి తెర తీయడం, అక్రమ నిర్మాణాలు, పన్నుల తగ్గింపు జాబితాలో స్థానిక కార్పొరేటర్లు, వారి సంబంధీకులు ఉండడంతో నగరంలో పన్ను వసూళ్ల ప్రక్రియ హాట్ టాఫిక్‌లా మారింది.

మున్సిపల్ యాక్ట్‌తోనే పన్నుల వసూళ్లు

• ఎమ్మెల్యే, కమిషనర్ యాక్ట్‌లు ఉండవు
• నాకు చెప్పకుండా మీ ఇష్ట ప్రకారం నిర్ణయాలు తీసుకుంటారా?
• 26 డివిజన్లలో బలవంతపు పన్ను వసూళ్లు చేయడం సరికాదు
• పన్నులు చెల్లించకపోతే కరెంట్ కట్ చేస్తామని బెదిరించడం ఏమిటి?
• ఇష్టారీతిన ప్రవర్తిస్తే ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం
• అధికారుల సమీక్షలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



కార్పొరేషన్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): ‘నగర పాలక సంస్థలో పన్ను వసూళ్లు మున్సిపల్ యాక్ట్ ప్రకారంగానే ఉండాలే తప్ప, ఎమ్మెల్యే యాక్ట్, కమిషనర్ సూర్యతేజ యాక్ట్ ఉండకూడదు. పన్నులు చెల్లించని వారి ఇంటి విద్యుత్, కుళాయి కనెక్షన్ తొలగించడం ఎంత వరకు సబబు. ఇలా భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించడం సహేతుకమేనా? అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో అత్యధిక మంది పేద, నిరుపేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలే నివసిస్తున్నారని తెలిపారు. అటువంటిది వారిని ఒప్పించి, మెప్పించి వసూలు చేయాలే తప్ప బెదిరింపు, బలవంతపు వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని తేల్చి చెప్పారు. మంగళవారం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సమావేశ మందిరంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి ఎస్ఎంసీలోని అని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. 26 డివిజన్లకు సంబంధించిన పలు అభివృద్ధి పనులతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఒక్క నెల్లూరు సిటీ నియోజవర్గంలోనే చేపట్టడం ఏమిటని?, రూరల్ నియోజక వర్గం ఏం పాపం చేసిందని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉంటే.. అందులో 26 డివిజన్లు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయన్న విషయాన్ని మరిచిపోతే ఎలాగన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న తాను అందుబాటులోనే ఉన్నానని, ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తనను సంప్రదించాలన్న విషయం తెలియదా? అని అధికారులను నిలదీశారు. మరోసారి ఇలా జరిగితే సహించనని హెచ్చరించారు.

ఇంటి పన్నులు కట్టాల్సిందే

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటి పన్నులు సంబంధిత యజమానులు కట్టాల్సిందేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అయితే పన్నుల వసూళ్ల విషయంలో ఎస్ఎంసీ రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు మాత్రం కరెక్ట్‌గా లేదన్నారు. తాను కోటీశ్వరుల సమస్యలు, సంక్షేమం, వారి అవసరాల గురించి మాట్లాడే వ్యక్తిని కాదని, పేద, నిరుపేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతానన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా, ఏ అన్యాయం జరిగినా అండగా ఉంటానని ఇందులో ఏ మాత్రం రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉండి ఇబ్బందులు కలుగుతుంటే మాత్రం అటువంటి దుకాణాలను తొలగించాల్సిందే కానీ, రెక్కాడితే కాని డొక్కాడని రోడ్డు మార్జిన్ వ్యాపారస్తుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ విభాగం ఆర్వో, ఆర్‌ఐల అంతర్గత బదిలీలు నిర్బంధంగా ఉండకూడదన్నారు. రెవెన్యూ ఆర్‌ఐలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా ఎలా నియమిస్తారని? వారు శానిటరీ కోర్సు చేయలేదు కాదా? మరోసారి ఆర్‌ఐలతో చర్చించి వారికి సమ్మతి అయితేనే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగించాలని లేని పక్షంలో ఎస్ఎంసీ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల్లో ఏదో ఒకదాంట్లో నియమించేలా చూడాలని కమిషనర్‌కు సూచించామన్నారు. తానొక్కడి వల్లే ఏదో అయిపోతుందని అనుకుంటే మాత్రం కాదని, అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే నగర పాలక సంస్థ అభివృద్ధి చెందుతుందని ఆ దిశగా అందరం పనిచేద్దామని ఆయన ఆకాంక్షించారు.

మంత్రి నారాయణ ప్రోద్బలంతోనే సాకేష్‌రెడ్డిపై దాడి

• కొడవలూరు సీఐ కేసు నీరుగార్చారు
• ఆయనపై ప్రైవేట్ కేసు వేస్తాం
• మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి
• సాకేష్‌ను పరామర్శించిన నేతలు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో బాధితుడు సాకేష్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (బారకాసు): తమ పార్టీ యువజన విభాగం నేత సాకేష్‌రెడ్డిపై దాడి మంత్రి నారాయణ ప్రోద్బలంతోనే జరిగిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన సాకేష్‌రెడ్డిని మంగళవారం నగరంలోని రాంజీనగర్ పుట్ట వీధిలో ఉన్న ఆయన నివాసానికి ఎమ్మెల్సీ, పార్టీ సిటీ నియోజకవర్గం ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నేతలతో కలిసి మాజీ మంత్రి కాకాణి వెళ్లి పరామర్శించారు. దాడి జరిగిన తీరును సాకేష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకాణి మీడియాతో మాట్లాడుతూ సాకేష్‌రెడ్డి తన పొలం పనుల కోసం కొడవలూరు మండలం, గండవరానికి వెళ్తే కొందరు వ్యక్తులు కిరాతకంగా దాడి చేశారన్నారు. జరిగిన దాడి హేయమైన చర్య అని ఇలాంటి దాడులు సరికాదన్నారు. దీనిపై తమ పార్టీ న్యాయపోరాటం చేస్తుందన్నారు. సాకేష్‌రెడ్డిని కొద్దిరోజులుగా వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి రావాలంటూ ఆ పార్టీ నేతలు ఒత్తిడి చేశారని, అందుకు సాకేష్‌రెడ్డి తలొగ్గకపోవడంతో దాడికి తెగబడ్డారన్నారు. మంత్రిగా ఉన్న నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటనపై విచారణకు ఆదేశించి, నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు చేపట్టి, తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. తీవ్రంగా దాడి చేస్తే పోలీసులు చిన్న కేసు పెట్టి వదిలేశారని, కొడవలూరు సీఐ కేసును నీరుగార్చారన్నారు. సీఐ సురేంద్రబాబుపై తాము ప్రైవేట్ కేసు వేస్తామని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాడి చేసిన వారిని వదిలి పెట్టేది లేదన్నారు. సాకేష్‌రెడ్డిపై దాడి ఘటన తదనంతరం పోలీసులు వ్యవహరించిన తీరు ఎస్పీ దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. మితిమీరి వ్యవహరిస్తున్న వారిపై భవిష్యత్‌లో చర్యలుంటాయన్నారు. సాకేష్‌రెడ్డికు తగిన న్యాయం జరగకపోతే తాము పోరాటంచేస్తామన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం గండవరంలో సాకేష్‌పై టీడీపీ నేతలు దాడి చేశారన్నారు. ప్రశాంతతకు మారుపేరైన జిల్లాలో ఇలాంటి దాడులు సరికాదన్నారు. తమ పార్టీకి చెందిన శ్రేణులను దాడి చేసి చంపే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెడితే న్యాయ పరంగా ఎదుర్కొంటామని, అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేలూరి మహేష్, కరిముల్లా, నీలి రాఘవరావు, కామాక్షిదేవి, జయలక్ష్మి, సీనియర్ నాయకులు హంజాహుస్సేనీ, మల్లి నిర్మల, కోటేశ్వరరెడ్డి, మున్వర్, రఘు, మాబాషా, కిషన్, మహేష్, సంధాని, యస్దాని, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

జోరువానలోనూ కార్మిక సంఘాల ధర్నా



కలెక్టరేట్ వద్ద జోరువానలో గొడుగులు వేసుకుని ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల కార్యకర్తలు

నెల్లూరు (అర్బన్): రైతులు, కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలంటూ జోరువానలోనూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, రైతు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కొత్త చట్టాల వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులకు గిట్టుబాటు ధరలు, కూలీలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. కృష్ణపట్నం పోర్టులో మూసేసిన కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించి ఉద్యోగాలు కోల్పోయిన 10 వేల మందికి తిరిగి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జేసీ కార్తీక్‌కు కార్మిక సంఘాల ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంగపట్నం రమణయ్య, మూలె వెంగయ్య, టీవీవీ ప్రసాద్, కె.పెంచలనరసయ్య, గద్దె నాగేశ్వరరావు, పుల్లయ్య, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వాన

• నెల్లూరులో లోతట్టు ప్రాంతాలు జలమయం
• పంట పొలాల్లో నార్లు, నాట్లు నీట మునక
• తీరం వెంబడి ఈదురుగాలులు

నెల్లూరు (అర్బన్): బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్రరూపం దాల్చడంతో జిల్లాలోని తీర మండలాల్లో సోమవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇది మరింత బలపడి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. దీని ప్రభావంతో రెండు రోజుల పాటు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మైపాడు, కొత్తకోడూరు, రామతీర్థం తదితర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు 3 మీటర్ల ఎత్తు వరకు ఎగిసి పడుతున్నాయి. సముద్రం సుమారు 50 అడుగులు ముందుకొచ్చింది. తీర ప్రాంత మండలాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసింది. మిగతా మండలాల్లో ఆకాశం మేఘావృతమై చెదురు, మదురు జల్లులు కురిశాయి. తీరం వెంబడి ఈదురు గాలులు వీస్తున్నాయి.

నెల్లూరు నగరంలో భారీ వర్షం

నెల్లూరు నగరంలో మంగళవారం తెల్లవారుజామునుంచే భారీ వర్షం కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. తర్వాత కూడా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియా, మాగుంట లేఅవుట్‌లోని ఖాళీ ప్లాట్లలో, ఆర్టీసీ కాలనీ, చంద్రబాబునగర్, శివగిరికాలనీ, జనార్దన్‌రెడ్డినగర్‌లోని భగత్‌సింగ్ కాలనీ, టీచర్స్ కాలనీల్లో వర్షపు నీరు నిలిచింది. కొత్తూరు, చౌటమిట్టకాలని, టైలర్స్ కాలనీల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరిపోయింది. పొగతోట, చిన్న బజారు, ఆచారివీధి, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీతో కూడిన వర్షపు నీరు రోడ్ల మీద ప్రవహించింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో వర్షపాతమిలా..

మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నెల్లూరు రూరల్ మండలంలో అత్యధికంగా 61.0 మి.మీ వర్షం కురిసింది. నెల్లూరు అర్బన్‌లో 56.0 మి.మీ, ఇందుకూరుపేట 40.6, వెంకటాచలం మండలంలో 33.2, కోవూరులో 28.8, తోటపల్లిగూడూరు 25.0, పొదలకూరు 24.0, ముత్తుకూరు 22.6, సైదాపురం 22.4, విడవలూరు 19.6, మనుబోలు 17.2, రాపూరు 14.0, అల్లూరు 11.0, కొడవలూరు 10.6, బుచ్చిరెడ్డిపాళెం 5.2, దగదర్తి 4.2, కలువాయి 4.0, కావలి 2.8, బోగోలు 2.2 మి.మీ. వర్షం కురిసింది. మిగతా మండలాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలోని మత్స్యకారులు తుఫాన్ ప్రభావంతో తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని, అప్పటి వరకు వేటకు వెళ్లొద్దని మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని మత్స్యకార గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. తీరంలోని బోట్లను, వలలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా జాగ్రత్త పరచుకోవాలన్నారు. మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మత్స్యశాఖ తరపున అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

సెలవు పెట్టకుండా విహారయాత్రకు..

• సీడీపీఓ, 30 మంది ఐసీడీఎస్ సిబ్బంది నిర్వాకం

ఉలవపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీఓతో సహా సెలవు పెట్టకుండా విహారయాత్రకు వెళ్లారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. సాధారణంగా ఎవరైనా విధులకు హాజరు కాకుండా ఉండాలంటే ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలి. కానీ అలాంటిదేమీ లేదు. ఏకంగా ఉలవపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ అరుణ తన ఉన్నతాధికారులకు చెప్పకుండానే జిల్లా దాటి మరో జిల్లాకు విహారయాత్రకు వెళ్లారు. ఇంకా సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు 30 మంది వరకు భైరవకోనకు వెళ్లారు. ఆయా కేంద్రాల్లో సెలవు చీటీ మాత్రం పెట్టి రిజిస్టర్‌లో నమోదు చేయలేదు. పరిస్థితిని బట్టి హాజరు వేసుకుందామని అనుకున్నారో.. ఏమో కానీ సూపర్‌వైజర్లు, కార్యకర్తల మధ్య విభేదాలు ఉండడంతో విషయం బయటకు పొక్కింది. కానీ సీడీపీఓ మాత్రం పీడీకి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్‌ను వివరణ కోరగా ఉలవపాడు సీడీపీఓ సెలవు పెట్టలేదని.. విహారయాత్రకు సంబంధించి సమాచారం ఇవ్వలేదని స్పష్టం చేశారు.


29 నుంచి బిజినెస్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న సతీష్

నెల్లూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఏపీ చాంబర్ బిజినెస్ ఎక్స్‌పో–2024 జరుగుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒమ్మిన సతీష్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్స్‌పో ఆరోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో కొండా శేఖర్‌రెడ్డి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



అల్లూరు: గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. అల్లూరు ఎస్సై కిశోర్‌బాబు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం అల్లూరు వాటర్‌ట్యాంక్ సెంటర్‌లో సుమారు 70 సంవత్సరాల వయసున్న వృద్ధుడు అపస్మారకస్థితిలో ఉండగా స్థానికులు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. అల్లూరుపేట వీఆర్వో మనోహర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96327 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రూ.3.6 లక్షల విలువైన ఫైబర్ కేబుల్ చోరీ

ఆత్మకూరు: మండలంలోని వెన్నవాడ గ్రామంలో ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించిన కేబుల్ చోరీకి గురైంది. సుమారు రెండు కిలో మీటర్ల మేర ఏర్పాటు చేయాల్సిన రూ.3.6 లక్షల విలువైన కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సంబంధిత కంపెనీ ఇంజినీర్ అశోక్ ఆత్మకూరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఐ జి.గంగాధర్, ఎస్సై ఎస్‌కే జిలానీలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జలదంకి: మండలంలోని చామదలలో వేముల పాటి తిరుపాలయ్య అనధికారికంగా 13 మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. అతను గ్రామంలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కురిస్తే నరకమే..

• నెల్లూరులో రోడ్లు జలమయం • ప్రజలకు అవస్థలు

నెల్లూరు సిటీ: వర్షం కురిస్తే చాలు.. నెల్లూరులోని ప్రధాన రహదారులు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. మోకాలిలోతులో నీరు నిలిచిపోతుండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ గుంత ఉందో తెలియక భయపడుతూ తిరిగాల్సి వస్తోంది. వర్షపునీరు, డ్రైయినేజీ కలిసిపోయి రోడ్లపై ప్రవహిస్తున్న పరిస్థితులున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి నెల్లూరులో ఎడతెరపి లేకుండా వాన పడుతోంది. దీంతో ప్రజల రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడింది. కేవీఆర్, పొగతోట, సండే మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఖాళీ ప్రదేశాలు చెరువులను తలపిస్తున్నాయి. రామలింగాపురం, మాగుంటలేవుట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవకుండా అధికారులు ప్రస్తుతానికి చర్యలు తీసుకున్నారు. రూరల్ పరిధిలోని పొట్టేపాళెం, సౌత్‌మోపూరు, కలివేలపాళెం, నారాయణరెడ్డిపేట, అల్లీపురం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల సమయానికే పొగమంచు దట్టంగా కమ్మేసింది. మరోవైపు చిరుజల్లుల కారణంగా జాతీయ రహదారిపై తిరిగే వారు ఇబ్బందులు పడ్డారు. పగలే లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఇంకా వానలు కురుస్తాయని అధికారులు చెబుతుండడంతో లోతట్టు ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సండే మార్కెట్‌లో నీట మునిగిన రోడ్డు





కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో..



సండే మార్కెట్ గాంధీ పార్కు వద్ద..



పొగతోట లా కాలేజ్ వద్ద ఇలా..



ఓ వైపు వర్షం.. మరోవైపు దట్టంగా కమ్మేసిన పొగమంచు



గొడుగుల విక్రయం



గొడుగుల కింద వ్యాపారం



నెల్లూరులో కురుస్తున్న వర్షం

సామాజిక న్యాయానికి జగన్ పెద్దపీట

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): గత వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న కాకాణి క్యాంప్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ దేశంలో ఆర్థికంగా, సామాజికంగా సమానత్వం ఉండాలని భావించి రిజర్వేషన్లు అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని తెలిపారు. ప్రపంచంలోనే శక్తివంతమైన రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అందించారని చెప్పారు. చరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించి, భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిని చాటి చెప్పేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. జగన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఆశయ సాధనకు తామంతా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాకాణి, ఎమ్మెల్సీ తదితరులు

కృషి చేయాలి

నెల్లూరు రూరల్: 'ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం ఉందంటే దానికి కారణం రాజ్యాంగం. ప్రతిఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభివృద్ధికి తమవంతు కృషి చేయాలి' అని జేసీ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ

జామాయిల్ పెంపకంతో వీఎస్ఎస్‌లకు ఆదాయం

• సీఎఫ్ కాశీ విశ్వనాథరాజు

నెల్లూరు(అర్బన్): అటవీ భూముల్లో జామాయిల్ పెంపకం ద్వారా వనసంరక్షణ సమితులకు ఆదాయం లభించి అందులోని సభ్యులకు ఉపాధి దొరుకుతుందని గుంటూరు నుంచి వచ్చిన కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి (సీఎఫ్) కాశీ విశ్వనాథరాజు తెలిపారు. జిల్లాలోని వనసంరక్షణ సమితుల చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, అటవీ శాఖ రేంజర్లు, అధికారులతో నెల్లూరు వేదాయపాళెంలోని ఎంవీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎఫ్ మాట్లాడుతూ పెరిగిన జామాయిల్ చెట్లను కట్ చేసి విక్రయించడం ద్వారా గత 20 ఏళ్లలో లేని విధంగా ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో సగభాగం ఫారెస్ట్ శాఖ తీసుకుని మిగతా సగదును వీఎస్ఎస్‌లకు అందిస్తున్నామన్నారు. దానిని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో టెండర్ ద్వారా జామాయిల్ చెట్లను దక్కించుకున్న సంస్థ మార్చి నెలలోగా కటింగ్‌ను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు.



మాట్లాడుతున్న సీఎఫ్ కాశీ విశ్వనాథరాజు

ఇప్పటికే కటింగ్ చేసిన ప్రాంతాల్లో 375 వీఎస్ఎస్‌ల ద్వారా జామాయిల్ మొక్కలను నాటుతున్నామన్నారు. పలు అటవీ గ్రామాలకు చెందిన వీఎస్ఎస్ చైర్‌పర్సన్లు మాట్లాడుతూ తమకు వస్తున్న ఆదాయంలో కొంత మొత్తాన్ని కట్ చేసి బీమా సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. చెట్ల ఎన్యుమరేషన్‌కు సంబంధించిన పాత బకాయిలను చెల్లించాలని, వీఎస్ఎస్‌ల ద్వారా లభించే ఆదాయాన్ని వ్యక్తిగతంగా వాడుకునేందుకు కొంత మొత్తాన్ని ఇవ్వాలని కోరారు. జిల్లా ఫారెస్ట్ అధికారి మహబూబ్‌బాషా మాట్లాడారు. కార్యక్రమంలో గుంటూరు స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతీప్రసాద్, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, రాపూరు రేంజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.35
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 102	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 210
లేయర్ (లైవ్)	: 110		
బ్రాయిలర్ చికెన్	: 190	లేయర్ చికెన్	: 187

ఏ హెచ్చరిక ఎందుకంటే..

ముత్తుకూరు: జిల్లా వ్యాప్తంగా వానలు కురుస్తున్నాయి. ఇవి కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా తుఫాన్ సమయంలో ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలను తెలుపుతుంటారు. ఇవి 1 నుంచి 11 వరకు ఉంటాయి. వాటి గురించి తెలుసుకుందాం.



నేలటూరు వద్ద అలల ఉధృతి



తుఫాన్ హెచ్చరిక తెలిపేదిలా.. (ఫైల్)

1. ముందు చూపు : దూరంగా ఈదురు గాలులు ఏర్పడొచ్చు.
2. హెచ్చరిక : దూరంగా తుఫాన్ ఏర్పడి ఉంది.
3. ముందు హెచ్చరిక : ఈదురుగాలులు ఈ రేవును తాకొచ్చు.
4. హెచ్చరిక : ఈ రేవును తుఫాన్ తాకినప్పటికీ ప్రమాదం లేదు.
5. అపాయం : రేవుకు దక్షిణ దిశలో సాధారణ తుఫాన్ ఏర్పడొచ్చు.
6. అపాయం : రేవుకు ఉత్తర దిశలో సాధారణ తుఫాన్ ఏర్పడవచ్చు.
7. అపాయం : సాధారణ తుఫాన్ ఈ రేవును తాకవచ్చు.
8. ఘోర అపాయం : రేవుకు దక్షిణ దిశలో పెద్ద తుఫాన్ ఏర్పడి దగ్గరగా తీరం దాటుతుంది.
9. ఘోర అపాయం : రేవుకు ఉత్తర దిశలో పెద్ద తుఫాన్ ఏర్పడి రేవు మీదుగా లేదా, దగ్గరగా తీరం దాటుతుంది.
10. ఘోర అపాయం : పెద్ద తుఫాన్ ఈ రేవును తాకుంది.
11. సమాచార వ్యవస్థ చిన్నాభిన్నం : వర్తమానం లేదు. ప్రాంతీయ అధికారి ప్రమాదం ఉందని భావిస్తున్నారు.



గుంత.. ఎన్నాళ్లీ చింత

కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని మరిచిపోయింది. ఈ చిత్రంలో కనిపిస్తున్న భారీ గుంత ఆదూరుపల్లి నుంచి పెంచలకోనకు వెళ్లే రహదారిలో ఉంది. మెయిన్ రోడ్డులోనే ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షం కురిస్తే నీళ్లు నిలిచి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. పెంచలకోనలోని నృసింహుడి ఆలయానికి నిత్యం ప్రజలు వాహనాల్లో ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఎంతో ముఖ్యమైన ఈ దారిలో పెద్ద గుంత ఉన్నా పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – చేజర్ల